క్లుప్తంగా

దరఖాస్తుల గడువు పొడిగింపు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లిలోని ఎస్‌బీ ఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో మహిళలకు ఇచ్చే ఉచిత శిక్షణ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 31వరకు పొడిగించినట్లు సంస్థ డైరెక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్ (31రోజులు), మగ్గం వర్క్ (31 రోజులు), సెప్టెంబర్ 5 నుంచి బ్యూటీపార్లర్ (35రోజులు) కోర్సుల్లో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. శిక్షణతో పాటు భోజన, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన గ్రామీణ ప్రాంత మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆసక్తి, అర్హత గల మహిళలు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, 10వ తరగతి ధృవీకరణ ప్రతం, బ్యాంక్ ఖాతా జిరాక్స్, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకుని వచ్చి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 08461- 295428 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బీవోలకు కొత్త ఫోన్లు అందజేత

డిచ్‌పల్లి: తపాలాశాఖ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి కలెక్టర్ ఆదేశాలతో బీవోలకు కొత్త మొబైల్ ఫోన్లను అధికారులు అందజేశారు. శుక్రవారం డిచ్‌పల్లి ఉప తపాలా కార్యాలయంలో సౌత్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుస్మిత బెనర్జీ క్లస్టర్ బీవోలకు ఫోన్లను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారులకు చేయూత పింఛన్లు అందించేందుకు ఈ కొత్త మొబైల్ ఫోన్ల ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలందించవచ్చని సుస్మిత బెనర్జీ తెలిపారు. డిచ్‌పల్లి తపాలా ఉప కార్యాలయ పరిధిలోని జక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి, సుద్దపల్లి, కొరట్‌పల్లి, యానంపల్లి, కులాస్‌పూర్, కంజర్, నడిపల్లి, పడకల్ బీవోలకు ఈ మొబైల్‌లు అందించారు. కార్యక్రమంలో తపాలా మెయిల్ ఓవర్ సీస్ స్నేహిత్, సబ్ పోస్ట్‌మాస్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మఠం కూల్చివేత నిర్ణయం సరైంది కాదు

నిజామాబాద్ రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో ఉన్న హథీరాంజీ మఠం కూల్చివేత నిర్ణయం సరైంది కాదని సామాజిక రచయిత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. శుక్రవారం వినాయక్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బంజారాల గురువు హతీరం బాబా మఠాన్ని స్థానిక అధికారులు కూల్చివేతకు నిర్ణయం తీసుకున్నారని దానిని మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో వేముల శేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

వర్సిటీలో జాతీయ క్రీడా దినోత్సవం

తెయూ(డిచ్‌పల్లి): తెయూలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ బీఆర్ నేత, జాదవ్ నరేశ్, మల్లికార్జున్, క్రీడాకారులు గౌస్, వెంకటేశ్, బి. శివ, అమృత్ చారి తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోగా ఇద్దరికి పదోన్నతులు!

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో డీఎంహెచ్‌వోగా ఇద్దరికి పదోన్నతులు లభించనున్నాయి. జిల్లా మలేరియా అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్, ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ పదోన్నతుల కోసం ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. మరో మూడు రోజుల్లో వీరికి పదోన్నతులు రానున్నాయి.

బదిలీ కోసం డీఎంహెచ్‌వో ప్రయత్నాలు

జిల్లా వైద్యశాఖ అధికారిణిగా విధులు నిర్వహిస్తున్న రాజశ్రీ హైదబాద్‌లో ఇన్‌చార్జి జేడీ పోస్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. గత ఏడాదిగా వ్యక్తిగతంగానే బదిలీ చేసుకోవాలని చూస్తున్నారని తెలిసింది.

నామినేషన్ దాఖలు



నిజామాబాద్‌నాగారం: పద్మశాలి హాస్టల్ ఎన్నికల పోరాట కమిటీ ప్యానెల్ సభ్యులు శుక్రవారం ఎన్నికల అధికారికి నామినేషన్ సమర్పించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ ప్రతినిధులు కోటా నాగేశ్, జి.రమేశ్, బొద్దుల స్వామి, బొద్దుల దేవేందర్, నరేందర్, దుంపేటి దేవరాజం, అంబటి శ్రీనివాస్, ప్రభాకర్, శ్రీనివాస్,పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

నిజామాబాద్ అర్బన్/ నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తున్న స్టాఫ్ నర్స్ ఎంపిక జాబితాలో అవకతవకలు జరిగినట్లు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సమీర్ హైమద్ శుక్రవారం తెలిపారు.ఈ మేరకు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు.అనంతరం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.కొందరు అభ్యర్థుల పేర్లు అనేకసార్లు ఎంపిక జాబితాలో వచ్చినట్లు డీఎంహెచ్‌వోకు విన్నవించినా స్పందించడం లేదన్నారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



గడ్కోల్ పుసాల తండా మధ్యన కోతకు గురైన రోడ్డు



కొండాపూర్‌లో.. కామారెడ్డి వైపు వెళ్లే రోడ్డు



గోప్య తండాలో..

కోలుకోలేని దెబ్బ..

- సిరికొండ మండలంలో మూడు వేలకు పైగా ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- రైతులకు, ఆర్అండ్‌బీ, విద్యుత్, నీటి పారుదల శాఖలకు నష్టం



సిరికొండ మండలం కొండూర్ వద్ద పొలాల్లో వేసిన ఇసుక మేటలు



కప్పలవాగు పక్కన కొట్టుకుపోయిన పొలం

సిరికొండ: మండలంలో గురువారం కురిసిన కుంభవృష్టి అపార నష్టం చేకూర్చింది. వరద ఉధృతికి పంట పొలాలు తుడిచిపెట్టుకుపోయాయి. వరద ధాటికి కొన్ని చోట్ల భూములు స్వభావాన్ని కోల్పోయాయి. ధర్పల్లి మండలం హోన్నాజీపేట్ అటవీ ప్రాంతంలోని ముత్యాల చెరువు తెగిపోవడంతో ఆ వరదంతా మధ్యల వాగు నుంచి కప్పలవాగులో కలవడంతో వరద ఉధృతి తీవ్ర స్థాయిలో పెరిగింది. దీనికి తోడు మొండి వాగు వరద, ముషీర్‌నగర్ పల్లెచెరువు అలుగు నీరు, ముషీర్‌నగర్‌లో మత్తడి చెక్‌డ్యాం తెగిపోవడంతో ఆ వరద కప్పలవాగులో కలవడంతో అంచనా వేయలేనంత వరద తీవ్రత పెరిగింది. కొండూర్ వద్ద ఒక కిలోమీటర్ మేర రెండు వరుసల రహదారి ధ్వంసమైంది. కప్పలవాగు ప్రారంభమయ్యే తూంపల్లి నుంచి మొదలుకొని గడ్కోల్, తాళ్లరామడుగు, కొండూర్, పెద్దవాల్గోట్, చిన్నవాల్గోట్ పరిధిలో మూడు వేల ఆరు వందలకు పైగా ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక నివేదిక రూపొందించారు. పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. గడ్డమీది తండా వద్ద, గడ్కోల్ వద్ద, కొండూర్ వద్ద, పెద్దవాల్గోట్ వద్ద రోడ్లు కోతకు గురవడంతో మండలం నుంచి జిల్లా కేంద్రం వైపు వెళ్లే నాలుగు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. వాగు పరిసరాల్లోని గ్రామాల పరిధిలో వందలాది విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వరదలో కొట్టుకుపోయా యి. మట్టిలో కూరుకుపోయాయి. లైన్లు తెగిపోవడంతో గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం రాత్రి ఏడు గంటల వరకు గడ్కోల్, ముషీర్‌నగర్, తాళ్లరామడుగు గ్రామాల్లో అంధకారం నెలకొంది. తూంపల్లి, గడ్కోల్, కొండూర్, పెద్దవాల్గోట్ గ్రామాల్లో వరద ఇళ్లలోకి చేరడంతో చాలా నష్టం వాటిల్లింది.

3680 ఎకరాల్లో పంట నష్టం

మండలంలోని 14 గ్రామాల్లో వర్షానికి పంటలకు నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి టి నర్సయ్య తెలిపారు. 3540 ఎకరాల్లో వరి, 100 ఎకరాల్లో మొక్కజొన్న, 40 ఎకరాల్లో సోయాబీన్ పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసి నివేదికను జిల్లా అధికారులకు అందించినట్లు ఏవో తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



మాది పెద్దవాల్గోట్.మా ఇళ్లలోకి నీళ్లు రావడం ఇదే తొలి సారి. ఆకస్మాత్తుగా వరద ఇంట్లోకి రావడంతో బియ్యం, ఇతర వస్తువులు పూర్తిగా తడిచిపోయాయి. బురద పేరుకు పోయింది.వరద తగ్గిన తర్వాత బురదను కడిగేశాం. బియ్యం తడిచిపోవడంతో తినడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రభుత్వం నిత్యావసర సరుకులు ఇచ్చి ఆదుకోవాలి. – మెతుకు లక్ష్మి, పెద్దవాల్గోట్

ఇల్లు పూర్తిగా కూలిపోయింది



కొండూర్‌లోకి కప్పలవాగు వరద పోటెత్తడంతో చాలా ఇళ్లలోకి నీళ్లు చేరాయి. వర్షానికి అనుగు జమునతో పాటు మరో పది మంది ఇండ్లు కూలిపోయాయి. వారికి ముదిరాజ్ సంఘంలో అధికారులు పునరావాసం ఏర్పాటు చేశారు. ఇల్లు కూలిపోవడంతో లోపల ఉన్న పూర్తి వస్తువులు అందులోనే ధ్వంసమయ్యాయి. – అనుగు జమున, కొండూర్



పెద్దవాల్గోట్‌లో ఇల్లు కూలిపోయి ధ్వంసమైన సామగ్రి



చిన్నవాల్గోట్‌లో కప్పలవాగుపై తెగిపోయిన చెక్‌డ్యాం



గడ్కోల్‌లో విద్యుత్ మరమ్మతులను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్

తగ్గుముఖం పట్టిన వరద



కోతకు గురైన కాల్‌పోల్ తండాకు వెళ్లే రోడ్డు



కులాస్‌పూర్ తండా చెరువు వద్ద జేసీబీతో అలుగులో తట్టుకున్న చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

రాకపోకలు యథాతథం

మోపాల్: వరుణుడు శాంతించడంతో మండలంలోని చెరువులకు వరద తగ్గుముఖం పట్టింది. మంచిప్ప అటవీ ప్రాంతాల నుంచి భారీగా వర్షపు నీరు రావడంతో మంచిప్ప పెద్ద చెరువు, కొండెం చెరువుల నుంచి అలుగు ఉధృతంగా ప్రవహించింది. మండలంలోని 13 చిన్నా, పెద్ద చెరువుల నుంచి నీరు అలుగుల ద్వారా కంజర్ పెద్ద చెరువులోకి భారీగా చేరింది. పంట పొలాలు మునిగిపోయాయి. వెంకట్రాంనాయక్ తండా, కాల్‌పోల్ తండాకు వెళ్లే రోడ్డు మంచిప్ప నుంచి అమ్రాబాద్ వెళ్లే రోడ్డు కోతకు గురైంది. కులాస్‌పూర్, ముదక్‌పల్లిలో వర్షానికి శిథిలావస్థకు చేరిన ఆరు ఇళ్లు పాక్షికంగా కూలాయి. వారికి కులాస్‌పూర్ ప్రాథమిక స్కూల్‌లో పునరావాసం ఏర్పాటు చేశారు. కులాస్‌పూర్ తండా వద్ద చెరువు అలుగులో తట్టుకున్న చెత్తను ఇన్‌చార్జి తహసీల్దార్ మునీరుద్దీన్, ఎస్సై సుస్మిత, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ సిబ్బంది తొలగింపు చర్యలు చేపట్టారు. చిన్నాపూర్, సింగంపల్లి, బాడ్సి, మంచిప్ప నుంచి అమ్రాబాద్, ఎల్లమ్మకుంట, కాల్పోల్, ఇతరత్ర గ్రామాలకు రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి.



ఇందల్వాయి-ధర్పల్లి రోడ్డు మార్గంలో కోతకు గురైన రోడ్డు

కోతకు గురైన రోడ్లు..

ఇందల్వాయి: భారీ వర్షాలకు ఇందల్వాయి మండలంలోని చాలాచోట్ల రోడ్లు, కల్వర్టులు కోతకు గురయ్యాయి. వాగులు, చెరువు పరివాహక ప్రాంతాల్లో ఉన్న పొలాలు నీట మునిగాయి. మండలంలోని పలు గ్రామాల్లో నష్టపోయిన పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఇందల్వాయి–ధర్పల్లి రోడ్డు మార్గంలో చెట్లు పడిపోగా అధికారుల సాయంతో స్థానికులు వాటిని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. వరద ప్రవాహానికి చాలాచోట్ల కల్వర్టులు కుంగిపోయాయి.



సిర్నాపల్లి శివారులో పడిపోయిన విద్యుత్ స్తంభం

అసెంబ్లీలో 'కాళేశ్వరం' లోపాలను చర్చిస్తాం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ సిటీ: అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలపై చర్చిస్తామని, మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావులను దోషులగా నిలబెడతామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్, హరీశ్‌రావులకు తప్పుచేశామని తెలిసే కాళేశ్వరంపై కమిషన్‌ను వ్యతిరేకించారన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లు పెడితే రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలు మద్దతిచ్చాయని, ఢిల్లీలో పోరాడదామంటే బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు ముందుకు రాకుండా ద్వంద్వ నీతి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. గుజరాత్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బీసీల్లో ముస్లింలు కూడా ఉన్నారని, వారిని కాంగ్రెస్ పార్టీ కొత్తగా చేర్చలేదని స్పష్టంచేశారు.

వరద బాధితులను ఆదుకుంటాం..

వరదలకు నష్టపోయినవారిని ప్రభుత్వం అన్నివిధాలా అదుకుంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. గత రెండు రోజులుగా అన్ని గ్రామాలు తిరుగుతూ బాధితులను ఆదుకుంటున్నామన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.25 కిలోల బియ్యం అందించామన్నారు. ముంపు ప్రాంత ప్రజలకు పునరావాసకేంద్రాలు ఏర్పాటుచేసి వాటిలో ఉంచామన్నారు. పాక్షికంగా ఇళ్లు దెబ్బతిన్నవారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేస్తామన్నారు. నాయకులు మునిపల్లి సాయిరెడ్డి, పొలసాని శ్రీనివాస్, డిచ్పల్లి సొసైటీ చైర్మన్ రామచందర్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ బాగారెడ్డి, నరేందర్, రాజలింగం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

పునరావాస కేంద్రం పరిశీలన

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సందర్శించారు. వరద బాధితులతో మాట్లాడుతూ.. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఎంపీడీవో రాజ్‌వీర్, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, పార్టీ నాయకులు పొలసాని శ్రీనివాస్ వాసుబాబు, భాస్కర్, దేవరాజు, రామకృష్ణ, రాంచందర్ గౌడ్, మురళి ఉన్నారు.

బింగి కల్యాణ మండపంలో..

రూరల్ మండల పరిధిలోని పాంగ్రాలో వరద ముంపునకు గురైన బాధితులకు ఆర్యనగర్‌లోని బింగి కల్యాణ మండపంలో పునరావాసం కల్పించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కల్యాణ మండపాన్ని సందర్శించి ముంపు బాధితులకు భరోసా కల్పించారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాయకులు పొలసాని శ్రీనివాస్, రాంచందర్‌గౌడ్, ఉమ్మాజి నరేశ్ ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

నిజామాబాద్ అర్బన్: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ ఒకటిన కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టనున్నట్లు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సుమన్ పేర్కొన్నారు. శుక్రవారం టీఎన్జీవోస్ కార్యాలయంలో నిరసనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ జిల్లా కో కన్వీనర్ మోహన్ రెడ్డి, కో చైర్మన్లు రమేశ్, రమణారెడ్డి, ధర్మేంద్ర, శ్రీనివాస్, కిషన్ పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి



కొండూర్ వద్ద తెగిపోయిన వంతెనను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

సిరికొండ/ ధర్పల్లి: వరద ఉధృతికి నష్టపోయిన బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ డిమాండ్ చేశారు. సిరికొండ మండలంలోని కొండూర్, పెద్దవాల్గోట్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. వరద తాకిడికి తెగిపోయిన కప్పలవాగు వంతెనను, పంటలను పరిశీలించారు. ధర్పల్లి మండలంలోని వాడి, నడిమి తండా, బీరప్ప తండాలను మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పరిశీలించి వరద బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా వెంటనే వరద బాధితులను ఆదుకోవాలన్నారు. నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

ధర్పల్లిలో పొంగిపొర్లిన వాగులు



బీరప్ప తండాలో పొలంలో కూరుకుపోయిన ట్రాక్టర్



బీరప్ప తండాలో పొలాల్లో ఇసుక మేటలు



నడిమి తండాలో..

ధర్పల్లి: మండలంలో మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వాగులు పొంగిపొర్లాయి. భారీ వర్షానికి హోన్నాజీపేట్ అటవీ ప్రాంతంలో ముత్యాల చెరువు కట్ట గురువారం ఉదయం తెగిపోవడంతో దాని దిగువన ఉన్న ముత్యాల వాగు పరిసర ప్రాంతాల్లోని వాడి, హోన్నాజీపేట్, నడిమి తండా, బీరప్ప తండా, లక్ష్మి చెరువు తండాలో భారీగా వరద చేరింది. వరద ప్రవాహానికి ముత్యాల వాగు పరిసర ప్రాంతాల్లోని పొలాలు కోతకు గురికాగా, పలుచోట్ల ఇసుక మేటలు వేశాయి. బీరప్ప తండాతోపాటు వాడిలో 8 ఫీట్ల మేర నీరు నిలిచింది. ఈ ప్రాంతాల ప్రజలను అధికారులు హోన్నాజీపెట్‌లో ఉన్న పునరావాస కేంద్రానికి తరలించారు. మండలంలో 600 ఎకరాల్లో వరి పంట నష్టం వాటినట్లు వ్యవసాయ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి అంచనా వేశారు. నడిమి తండా, బీరప్ప తండా, వాడి గ్రామంలో ముత్యాల వాగు ఉగ్రరూపానికి వరి పంటలు కోతకు గురయ్యాయి. శుక్రవారం ఉదయం నుంచి ముంపునకు గురైన గ్రామాల్లో ఇళ్లల్లో వరదతో కొట్టుకొచ్చిన బురదను తొలగించేందుకు ఇబ్బందులు పడ్డారు. కొన్నిచోట్ల ఫైర్ ఇంజన్ సాయంతో గ్రామంలో బురదను తొలగించారు. వరద ప్రవాహానికి ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు కొట్టుకుపోవడంతో, వాడి, నడిపి తండా, కర్నల్ తండా, బీరప్ప తండాలో రెండు రోజులు కరెంటు లేకుండా అంధకారంలో ఉండిపోయాయి. శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరణ చేపట్టారు. వర్షంతో చేతికొచ్చిన పంటలు నష్టపోయామని ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంట నష్టం జరిగింది



ముత్యాల చెరువు కట్ట తెగిపోవడంతో నాకు ఉన్న ఐదు ఎకరాల పొలం పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు కొట్టుకుపోయాయి. పంటలో ఇసుక తప్ప ఏమీ లేదు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి. – ధరావత్ రతన్, రైతు, బీరప్ప తండా

ప్రభుత్వం ఆదుకోవాలి



వాడి గ్రామంలో వందేళ్లలో ఎప్పుడూ ఊహించని విధంగా ముత్యాల చెరువు తెగిపోవడంతో కొన్ని నిమిషాల్లోనే గ్రామం పూర్తిగా ముంపునకు గురైంది. కుటుంబ సభ్యులందరం దాబాల తలదాచుకున్నాము. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి. – సురేందర్, వరద బాధితుడు, వాడి

చెక్ డ్యామ్, విద్యుత్ స్తంభాల పరిశీలన



చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న అధికారులు



చిన్నాపూర్‌లో ఏడీఈ, ఏఈ

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్‌లో ఉన్న చెక్ డ్యామ్‌ను ఇరిగేషన్ ఎస్ఈ రామారావు శుక్రవారం పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు చెక్‌డ్యామ్ ను ఆనుకొని ఉన్న మట్టి కట్ట కోతకు గురైంది. దీంతో ఇరిగేషన్ ఎస్ఈ మట్టి కట్టను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఆయన వెంట ఇరిగేషన్ డీఈఈ గంగాధర్ నాయక్, క్వాలిటీ కంట్రోల్ ఈఈ దత్తాద్రి, డీఈఈ శాంతాబాయి, ఏఈ సిద్ధార్థ రెడ్డి ఉన్నారు.

చిన్నాపూర్‌లో విద్యుత్ స్తంభాలు..

మోపాల్: మోపాల్ మండలంలోని చిన్నాపూర్ శివారులో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను ఏడీఈ రెంజర్ల బాలేశ్, ఏఈ నాగ శర్వాణి పరిశీలించారు. 133 కేవీ డిచ్‌పల్లి సబ్‌స్టేషన్ నుంచి వయా కంజర్ సబ్‌స్టేషన్ మీదుగా 13.5 కిలోమీటర్లు ప్రత్యామ్నాయంగా ఇటీవల వేసిన లైన్లు నేలకొరిగినట్లు ఏఈ నాగశర్వాణి తెలిపారు.కేవలం ఒక స్తంభం మాత్రమే ధ్వంసమైందని, మిగతా ఆరు స్తంభాలు నేలకొరిగాయని, నష్టం ఎక్కువగా లేదని పేర్కొన్నారు.

పునరావాస కేంద్రాలు..

నిజామాబాద్ సిటీ: జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇబ్బందులు పడుతున్న లోతట్టు ప్రాంతాల ప్రజలను మున్సిపల్ అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గూపన్‌పల్లిలోని గోదాంలు, మాధవనగర్‌వాసుల కోసం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌ను సిద్ధం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి కావాల్సిన తాగునీరు, ఆహారం అందించారు. అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, అడిషనల్ కమిషనర్ రవీంద్రసాగర్, ఆర్డీవో రాజేంద్ర కుమార్‌లు పునరావాలస కేంద్రాలను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు.



పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన హెచ్‌ఎం

మోపాల్:మండలంలోని సిర్‌పూర్ ఉన్నతపాఠశాలలో వ్యవహార భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా హెచ్ఎం వి సత్యనారాయణ మాట్లాడుతూ..గ్రాంథిక భాష నుంచి తెలుగును వ్యవహార భాషగా మల్లించిన వైతాళికుడు గిడుగు రామ్మూర్తి అని అన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలకు చిమ్మపూడి ఫౌండేషన్ హైదరాబాద్ వారు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు, ఉపాధ్యాయులు శ్యామల, మోహన్, అక్బర్ భాషా, వందన, డాక్టర్ హజారే శ్రీనివాస్, లలిత పాల్గొన్నారు.

శబ్దతరంగిణి సంస్థ కార్యాలయంలో..

నిజామాబాద్ రూరల్: నగరంలోని సరస్వతినగర్‌లో ఉన్న శబ్దతరంగిణి సంస్థ కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సేర్ల దయానంద్ అధ్యక్షతన తెలుగు భాష దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పోతన్నారి లక్ష్మణ్, గాండ్ల సంతోష్, ఆనంపల్లి రాజబాపు, సామల హరీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జీజీ కళాశాలలో..

నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల, కొరవి గోపరాజు తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, డాక్టర్ రాజేశ్, రాహుల్, డాక్టర్ శమంత, డాక్టర్ శ్రీనివాస్, కె. గంగాధర్, రాజేశ్వర్, రాధిక, అర్చన, రాజశేఖర్, ప్రతిభ, సుభాషిని దేవి, లావణ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.